

# విలువలు

– రాణి సత్యనారాయణ

సాయంవేళ చల్లగాలికి షాపులోని వార పత్రికలు ఇతర అద్దె పుస్తకాలు రెపరెపలాడుతున్నాయి. లోపల కూర్చున్న సతీష్ ఆశగా, ఆతృతగా ఎదురు చూస్తున్నాడు ఆమె కోసం.

ఆమె రోజూ ఆరు ఏడు గంటల మధ్య తన షాపుకు వస్తుంది. ఆ గంట, ఆమె వచ్చి వెళ్ళేవరకూ ఎంతో టెన్షన్ ఫీల్ అవుతాడు సతీష్.

చేతికున్న వాచీలో టైమ్ చూసుకున్నాడు. ఆరు దాటింది. కనుచూపుమేర దృష్టి సారించాడు. దూరంగా ఆమె వస్తున్న జాడ. కళ్ళు ఆనందంగా మెరిసాయి. మనసు మత్తుగా మూలిగింది. ఆమె రూపం కళ్ళముందు కదిలింది.

చటుక్కున్న అద్దెకు పుస్తకాలు ఇచ్చినపుడు వ్రాసుకునే పుస్తకం తీసి పేజీలు తిప్పాడు. 'సాగరిక' అని అందంగా తను వ్రాసిన పేరు దగ్గర ఆగిపోయాడు. తన ప్రమేయం లేకుండానే ఆ పేరును చూపుడు వేలితో తడిమాడు. పద్దెనిమిదేళ్ళ సాగరిక లేత తమలపాకులా వుంటుంది. అందమైన ముఖం. ఆ ముఖంలో ఫస్ట్ మార్క్ కొట్టేసేవి అందమైన అద్భుతమైన కళ్ళు. రెండవ రాంక్ నవ్వేనప్పుడు పెదవి విరుపు, పంటి మెరుపు, సన్నటి నడుము, పరిపక్వతకు రాని దోర అందాలు.

సతీష్ ఊహలనుండి నిజంలోకి రాగానే సాగరిక పుస్తకం పట్టుకుని షాపుముందు నిలబడింది. దూరంగా వున్నప్పుడు ధైర్యంగా వుంటుంది కాని ఆమె షాపు దగ్గరకు వచ్చినప్పుడు మాత్రం అంతకు ముందు వున్న ధైర్యం ఉష్‌కాకీ అయిపోతుంది. మాటలు రావు.

ఆమె ఇచ్చిన పుస్తకం తీసుకుని తిరిగి ఇచ్చినట్టు నోట్ చేసుకొని ఇంక ఏ పుస్తకం తీసుకుంటారు అన్నట్లు సాగరిక వంక చూశాడు సతీష్.

ఆమె క్లిప్పులకు వ్రేలాడ తీసిన పుస్తకాలను ఒక్కొక్కటి పరీక్షిస్తోంది, కొత్తగా వచ్చిన మరో వారపత్రికను తీసి ఇది వ్రాసుకోండి అని అంది.

కోయిల గొంతులా వుంది సాగరిక గొంతు. అలాగే అన్నట్లు తల ఊపి ఆమె పేరు వార పత్రిక పేరు, నోట్ చేసుకున్నాడు సతీష్.

అతను నోట్ చేసుకోవడానికి ముఖం కొద్దిగా క్రిందకు వంచినపుడు క్షణకాలం పరీక్షగా చూసింది సాగరిక.

ఉంగరాల జుట్టుతో చక్కటి మీసకట్టుతో హీరోలా వున్నాడనుకుంది మనసులో. టీనేజ్‌లోవున్న అమ్మాయి అబ్బాయిల మధ్య ఆకర్షణ ఎంత సహజమో సాగరిక సతీష్‌ల మధ్యకూడా ఆ సహజత్వమే వుంది. అప్పుడప్పుడు మనసులోకి కూడా తొంగి చూస్తున్నాడు. తను కంటపడినపుడు సతీష్‌లోని కంగారును, ఇబ్బందిని చూస్తుంటే అతనికి కూడా తనపై ఇష్టం వుంది అని కూడా గ్రహించకపోలేదు.

అలా రోజులు గడుస్తున్నాయి. సాగరిక ఇంటరు పాసయింది. తలి తండ్రులు అంతటితో సాగరిక చదువు ఆపుచేయి ఛి పెళ్లి చేసి పంపేస్తే కొంత బాధ్యత తీరుతుందని అభిప్రాయపడుతున్నారు.

ఈ విషయం తెలిసిన తరువాత సతీష్ గురించి అనేక సార్లు ఆలోచించింది సాగరిక. ఒకసారి షాపుకు వెళ్ళినపుడు కస్టమర్లు ఎవరూ లేకపోవడంతో ధైర్యంచేసి సాగరికతో మాట్లాడాడు సతీష్. "సాగరికగారు! మీరంటే నాకు ప్రాణం. మీకు నేను ఇష్టమేనా అని అడిగే ముందు నాగురించి చెప్పుకోవాలి. నేను ఎస్.ఎల్.సి ఫెయిల్ అయ్యాను. చదువు నాకు అచ్చిరా లేదనుకొని ఈ చిన్న బిజినెస్ ప్రారంభించాను. దీనినింకా అభివృద్ధి చేయగలనని, దీని మీద వచ్చే ఆదాయంతో ఒక చిన్న సంసారాన్ని నడుపగలనని నా నమ్మకం. నాకున్నది నన్ను ప్రాణ ప్రదంగా ప్రేమించే మా అమ్మ మాత్రమే. చిన్ని పెంకుటిల్లు కూడా వుంది. నాకున్నంతలో మిమ్మల్ని అందంగా, ఆనందంగా చూసుకుంటాను. మీరు ఆలోచించి మీ అభిప్రాయం చెప్పండి" శాంతంగా చిరునవ్వుతో అన్నాడు సతీష్.

ఈసారి మరింత సీరియస్‌గా ఆలోచనల్లో పడింది. తనను ప్రేమించే మనసువుంది. అందమైన రూపంవుంది. స్వతంత్రంగా జీవించగల శక్తి వుంది. కాని..కాని స్టేటస్ అంతగా లేదు. పైగా తనకన్న చదువులో తక్కువ. అందరిముందు ఎంత నామోషీగా వుంటుంది. తన స్నేహితులకు, బంధువుల అమ్మాయిలకు వచ్చిన భర్తలంతా వారికన్నా చదువుకున్నవారు ఉద్యోగస్తులూను. వారు ఎప్పుడైనా తన ఇంటికి వస్తే తను ఎంత చిన్నబోతుంది. సతీష్‌తో తన జీవితం ముడివేసుకోవడం గొప్పగా లేదనుకుంది సాగరిక.

ఆ తరువాత నుండి సతీష్ షాపుకు వెళ్ళడం మానివేసింది సాగరిక. వారం రోజులు...పది రోజులు.... నెల రోజులు ఎదురుచూసాడు సతీష్. సాగరిక అభిప్రాయంఅర్థమయింది.

సాగరిక చదువు ఆగిపోయింది. తల్లిదండ్రుల పెళ్లి ప్రయత్నాలు వేగాన్ని అందుకున్నాయి. దిగితే కాని లోతు తెలియదన్నట్లు పెళ్లి కొడుకులు చూడడానికి వచ్చి అమ్మాయి నచ్చిందని చెప్పి వెళ్లేవారు.

తరువాత కట్నాలు రేట్లు వింటుంటేమతిపో ంది సాగరిక తల్లిదండ్రులకు.

ఆరునెలలు గడిచిపోయాయి. చిన్న అసంతృప్తి వినుగు వారిలో పెళ్లి ప్రయత్నాలను తాత్కాలికంగా ఆపుచేశాయి. సాగరిక ప్రేయివేటుగా బి.ఎ కట్టాలను కుంది. పెళ్లి తలంపు ప్రక్కన పెట్టి పూర్తిగా చదువుపైనే దృష్టి నిలిపింది. బి.ఎ పూర్తి చేసిన తరువాత పెళ్లి ప్రయత్నాలు చెయ్యొచ్చులే అనితమ అశక్తతను అందంగా సరిపెట్టుకున్నారు సాగరిక తలితండ్రులు.

మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. డిగ్రీ చేతికి వచ్చింది సాగరికకు. ఇదివరకు వచ్చిన సంబంధాలకు కట్నం తక్కువ అనే వంకవుంది. కాని ఇప్పుడు వచ్చిన సంబంధాలకు అమ్మాయి చదువు ఎక్కువే. కట్నం చూస్తే తక్కువ అని రెండు వంకలు చెపుతున్నారు. నిజం చెప్పాల్సి వస్తే సాగరికకు కూడా మనసులో తనకంటే ఎక్కువ చదువుకున్నవాడు ఏ ఎమ్కాం, ఎమ్.ఎ. నో వస్తే బాగుండును అని వుంది. కాని పరిస్థితులు కలిసిరావడం లేదు.

ఖాళీగా వుండడం ఎందుకులే అని కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అవ్వసాగింది. ధరలు రోజు రోజుకు ఎలా పెరుగుతున్నాయో కట్నాల రేట్లుకూడా పెరుగుతున్నాయి. కాని సాగరిక తలితండ్రుల ఆర్థిక స్థోమత మాత్రం ఏ మాత్రం పెరగకుండా అలాగే వుంది. తనకు అన్ని విధాలా నచ్చిన సంబంధం తన తల్లిదండ్రులు తనకు తేలేరేమో అన్న అనుమానం కూడా కలుగక పోలేదు సాగరికకు.

సాగరిక అదృష్టం బాగున్నట్లుంది. బేంక్‌లో కేషియర్‌గా జాబ్ వచ్చింది. అప్పటికి పాతికేళ్ళు పైన పడ్డాయి. ఇంక ఇప్పుడువచ్చేసంబంధాలలో అమ్మాయి కొంచెం ముదురు అనే మాటలు వినవడుతున్నాయి. ఉద్యోగం వుంది కాబట్టి కట్నం రేటు కొంచెం తగ్గిన మాట వాస్తవమే. కాని సంఘం మెచ్చే విధంగా అన్ని విధాలా తనకన్నా ఎక్కువగా వున్న వ్యక్తిని వివాహం చేసుకోలేక పోయింది.

కాని సంఘం యొక్క ధోరణి మెల్లమెల్లగా అర్థమవసాగింది. సాగరికకు, తనకన్నా తక్కువ హోదావాడిని చేసుకుంటే గేలిచేస్తుంది ఈ సంఘం. ఎక్కువ హోదాగల వాడి కోసం ఎదురుచూస్తుంటే దీనికి పెళ్లీడు దాటిపోతుంది. ఇంకా పెళ్లి ఎందుకు కావడంలేదో! ఏదో లోపం వుండి వుండాలి. అసలు పెళ్ళి అవుతుందో లేదో! అంటుంది అదే సంఘం! వయసుతోపాటు అనుభవం పెరుగుతోంది. అరిచే కుక్కని కసిరికొడితే తోక ముడుచుకుపోతుంది అని తెలుసుకోవడానికి ఇరవై ఎనిమిదేళ్ళు పట్టాయి సాగరికకు.

ఎన్నో ఏళ్ళ క్రిందట తనను ప్రాణ సమానంగా ప్రేమించిన సతీష్ కళ్ళముందు కదిలాడు సాగరికకు. బాధగ నిటూర్చిందొకసారి. మనసు పాతజ్ఞాపకాల వెంట పరిగెడుతుంటే కాళ్ళు పాత పరిసరాల వైపు సాగిపోతున్నాయి. సతీష్ ఎక్కడవున్నాడో ఎలా వున్నాడో అనుకుంది సాగరిక.

ఇది వరకు సతీష్ షావు వుండే స్థానంలో ఇప్పుడొక పెద్ద బుక్ స్టాల్ వుంది. నలుగురు అసిస్టెంట్స్ వున్నప్పటికి షాపు యజమాని అందరికీ పుస్తకాలు అమ్మలేకపోతున్నాడు. స్టూడెంట్స్‌తో కిటకిటలాడిపోతోంది షాప్. ఆ షాపులోనే ఒక విభాగంలో వారపత్రికలు, నవలలు, ఇతర అద్దెపుస్తకాలు నీట్‌గా వ్రేలాడుతున్నాయి. మరో విభాగంలో పాత పుస్తకాలు పాఠ్య గ్రంథాలు కొని అమ్మబడుతున్నాయి అప్రయత్నంగా షాపులోకి అడుగుపెట్టింది. అయిదు నిముషాలు అక్కడే గడిపింది. ఎక్కడా సతీష్ జాడలు కనవడడం లేదు. అయినా తన పిచ్చిగాని పదేళ్ళ క్రిందటి ఈ ప్రదేశంలో వున్న చిన్న పాన్ షాపు ఇంకా అలాగే వుంటుందా? అప్పటి సతీష్ ఇంకా ఇక్కడే వుంటాడా? వుంటే మటుకు ఈ అహంకారి కోసం, మూర్ఖురాలి కోసం పెళ్లి చేసుకోకుండా ఎదురు చూస్తుంటాడా! విరక్తిగా నవ్వుకుని బయటకు వెళ్లబోయింది.

"ఏం కావాలి మేడమ్! మా దగ్గర దొరకని బుక్ అంటూ ఉండదు", అన్న మాటలు వినబడితే వెను తిరిగింది సాగరిక.

ఒక్క క్షణం తన కళ్లను తానే నమ్మలేకపోయింది. ఒక్కసారి కలా నిజమా అనుకుంది. కళ్లు ఏదో తప్పు చేసానన్న భావంతో వాలిపోయాయి. ఎదురుగా సతీష్. ఇప్పుడు కొద్దిగా పెద్దరికం వచ్చింది.

" పదేళ్ల క్రిందటి పుస్తకం. దొరుకుతుందేమోనని గుడ్డి నమ్మకంతో వచ్చాను" ఎలాగో గొంతు పెగల్చుకొని అన్నది సాగరిక.

సతీష్ ముఖంలో ఆనందం చోటు చేసుకుంది.

"అది మీకు ఒకసారి అమ్మి వేసిన పుస్తకం. మీరు వచ్చి తీసుకొనే వరకూ అలాగే వుంటుంది. సంవత్సరాలు కాదు, దశాబ్దాలు అయినా సరే" సంతోషంగా దృఢంగా అన్నాడు సతీష్.

"అంటే...అంటే.. ఇన్ని నాళ్ళు పెళ్ళి చేసుకోకుండా...నా కోసం" కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరుగుతుంటే, గొంతు పూడుకుపోతుంటే అన్నది సాగరిక.

సతీష్ సాగరిక చేయి అందుకొని షావు బయటకు నడిచి నేమ్ బోర్డ్ వైపు చూపించాడు. "సాగరిక బుక్ స్టాల్" నీళ్ళు నిండిన కళ్లతో అస్పష్టంగా చదివింది సాగరిక. □

'మేరీ' గోల్డు కవరింగ్ జ్యూయలరీ ఫ్యాషన్సులో అందెవేసిన చేయి. ప్రపంచంలోని స్త్రీలందరూ నాణ్యతకు - మన్నికకు వాడవలసినవి - ధరించవలసినవి - అలంకరించవలసినవి. కంటికింపగు యీ ఆభరణముల కొరకు నేడే మీ ఆర్డరును పంపించండి. వి.పి.పి. ద్వారా ఆభరణములను పొందండి డిజైను నంబర్లను మరియు ఉచితమైన కేటలాగులను ప్రత్యేకముగా అడుగుట మరిచిపోవద్దు.




MERI GOLD COVERING WORKS

P.O.BOX 1405, 14, RANGANATHAN STREET

T.NAGAR, MADRAS - 600 017, PHONE: 444671